


**చేగొండి రామజోగయ్య**

గదిలో బైడ్ లైటు, శృంగారరసం నూనె లేని జీవితంలా మసకమసకగా ఏదో ఉన్నాననిపిస్తోంది. చిందరవందరగాఉన్న బెడ్ మీద నిద్రపట్టని ఇరవై ఏళ్ల ప్రకాశం, ఆకాశంలోని తడిలేని మేఘంలా, అశాంతిగా, అటూ ఇటూ మెదుల్తూ, కదుల్తూ ఉన్నాడు. మదిలో కోరికల సుడిగుండాలు, గుండెను కమ్ముకొని పిండేస్తూ ఉంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భారంగా జరుగుతుండగా, శృంగారేచ్ఛ శరీరాన్నంతటినీ శరపరంపరలుగా గుచ్చేస్తూ బాధిస్తూండగా, స్వీయనియంత్రణ గోల్పోయి, వేడెక్కిపోతూ, చెమటతో ముద్దయిపోసాగేడు.

ఆ రోజు రాత్రి పక్క మంచం మీద పడుకొని హాయిగా గురక పెడ్తూ, కొంచెం నిద్రాభంగం కల్గించే రూమ్మేటు 'రూపారావు' ఊరెళ్లినందువలన, రూములో లేకపోవటం, ప్రకాశానికి సుఖనిద్ర ప్రాప్తించాలి, నిజానికి కాని ఈ రాత్రి అతనికి ఏమాత్రం, నిద్ర పట్టకపోవడానికి కారణం, ఆ రోజు సాయంత్రం, ఊరెళ్లే ముందు, బస్ స్టాండులో రూపారావు "నువ్వు శుద్ధ వేస్ట్ ఫెలోవిరా!" అని ముఖం మీదే ముప్పయ్యోసారి అనటం ఏదో సర్వే ఫలితాలు పేర్కొంటూ, "ఇరవై ఏళ్లు నిండినా, 'ఆ అనుభవం' పొందని, 'ఆ రుచి' చూడని, మగాణ్ణి నిన్నే చూస్తున్నానురా" అని కొసరు పలకటం!

తన రూములో ఉచితంగా వసతి కల్పించడమే గాక, అప్పుడప్పుడు తన చదువుకి, వీలైనంత ధనసహాయం కూడా చేసే, రూపారావంటే, మన ప్రకాశానికి గురుభావం. అతని మాటలంటే గురి ఉంది. అతనూ ఎప్పుడూ తన గురించి ఎక్కువ చెప్పుకొనేవాడు కాదు గాని. ఆ వేళేమైందో, బాగా రెచ్చిపోయేడు! ఉదయం నుంచి ఊరెళ్లేదాకా, ప్రకాశం చెవులూదరగొట్టేశాడు-తన "అనుభవాలు" అడక్కుండానే ఏకరువు పెట్టేడు.

మీసాలు రాక పూర్వం నుంచీ, సులభంగా తనకు లభ్యమైన శృంగారరాజ్యపు వీసాల గురించి, ఎందరో ముద్దుగుమ్మలతో తను జరిపిన మధురక్రీడానుభవాల గురించి తెగ వర్ణించి చెప్పేడు. అంతేనా, ఆ రోజు తను వెళ్తున్నది, డబ్బు తెచ్చుకోవడానికి స్వగ్రామానికి కాదనీ, ఫ్రాకుల కాలం నుండి పరికిణీ, చీరల ప్రాయానికొచ్చిన ఓ చిన్నదానితో ఉన్న చిరకాలానుబంధం, హద్దులు లేని ప్రణయాన్ని కొనసాగించడానికీ, మరో ఊళ్లో ప్రస్తుతం ఉన్నదాని దగ్గరకని చెప్పి మతిపోగొట్టేడు.

"బాసూ మనం కాస్త చొరవ తీసుకోవాలే గాని, ఎవతైనా బుట్టలోపడతాది. బట్టలూడదీసుకొని మీద పడ్తాది" అని పచ్చిగా వాగేడు నూనూగు మీసాల వయసులోనే మీనాక్షులను వలపు వలలతో పట్టి, ఆపైన 'ఓ పట్టు' పడితేనే, 'మజా' కాని ఎప్పుడో చదువు పూర్తయి పెళ్లయ్యే దాకా శృంగారాధ్యయనానికి వేచి ఉండాలనుకోవటం అవివేకమని జ్ఞానబోధ చేశాడు. మొత్తానికి "రాముడు మంచి బాలుడు" లాంటి ప్రకాశం మనసులో అసంతృప్తి చీకట్లు నింపేశాడు! తన మానాన్న తాను దిగ్విజయ (శృంగార) యాత్రకై, ఏదో పల్లెకి వెళ్లే బస్సు ఎక్కేసి వెళ్లిపోయేడు.

అతన్ని బస్సెక్కించి, రూముకి తిరిగివచ్చిన ప్రకాశానికి, చదువెక్కలేదు. కావాలని, రూపారావు తనకు కనపడేలా, బల్ల మీద పెట్టిన సెక్సు పుస్తకాన్ని ఆబగా ఆమూలాగ్రం చదివేడు. ఇక నిద్రేం పడ్తుంది? ఆ రూము, ఒక గంగాభాగీరథీసమానురాలు, అరవై ఏళ్ల వృద్ధమహిళ, ఒంటరిగా ఉంటున్న ఇంటి గేటు దగ్గర ఉన్న చిన్న రేకుల షెడ్డు-ఇంటి యజమానురాలి జీవనానికున్న ఇతర వనరులేమిటో తెలియదు గాని, ఇద్దరి తరపున నెలనెలా ఠంచనుగా రూపారావిచ్చే రెండొందల రూపాయల అద్దె ఆమె ఆర్థిక తాపానికి "చన్నీళ్ల"ని చెప్పవచ్చు. అగ్రకులమన్న కారణంగా హాస్టల్లో వసతి దొరకని ప్రకాశాన్ని అక్కున చేర్చుకొని, తన రూములో ఉచితంగా ఆశ్రయం కల్పించి, చెలిమి పెంచుకొన్న

రూపారావంటే, ప్రకాశానికి ఎంతో గౌరవం-తనెలాగూ పెద్దగా చదవని పాఠ్యపుస్తకాలను ప్రకాశానికి నిత్యం అందుబాటులో ఉంచే రూపారావు, బాగా చదువుకొని తన ముసలి తల్లితండ్రులకు ఆసరా కావాలని ప్రకాశానికి బుద్ధి చెప్పేవాడు. కాని ఈ రోజెందుకో కొత్త పాఠాలు చెప్పేడు-తన శృంగార జీవితం గురించి సొంత డబ్బా బాగా కొట్టుకొని, ప్రకాశాన్ని గదిలోఒంటరిగా తుంటరి ఆలోచనలకు గురిచేశాడు.

ప్రకాశానికి నిద్ర పట్టటం లేదు ఎంత ప్రయత్నించినా-తన ఆర్థిక దుఃస్థితి, పక్కదారులు పట్టకూడదన్న ధర్మం మధ్య మధ్యలో గుర్తుకు వస్తున్నా, రూపారావు చెప్పిన కథలు మళ్లీ మళ్లీ మనసులో దూరి పోతున్నాయి. ఒక్కసారికైనా 'అదేదో' కావాలన్న కాంక్ష తీవ్రమైపోసాగింది.

''ఒరేయ్! చెప్పలేంరా, ఒక్కోసారి మన ప్రయత్నమేమీ లేకుండానే, వలచిన వనిత తనకు తానే సాహసించి వచ్చి మన వొళ్లోకి వాలిపోతుంది. నాకలాంటి అదృష్టం నాలుగైదుసార్లు కల్గింది. నమ్ము నీ మీదొట్టు'' అన్న మిత్రుడు రూపారావు పలుకులు పదే పదే గుర్తుకొచ్చేయి. అంతలో ''నా అందానికి అంత అదృష్టం కూడానా?'' అన్న భావం మనసుని చెళ్లున కొట్టింది (నిజమే ప్రకాశం అంత అందగాడు కాదు). నిస్పృహకూ, ఆత్మన్యూనతకూ గురిచేస్తోంది!

ఎవరీ అమ్మాయి? అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఎందుకొచ్చింది? ఎవరో తరుముతుంటే తలదాచుకోవడానికి వచ్చినట్లుగా, కంగారుగాలేదు. చంద్రబింబం లాంటి గుండ్రని ముఖం. నవ్వుతున్నట్లున్న కాంతిగోళాల్లాంటి పెద్ద పెద్ద కళ్లు. బిగుతు జాకెట్టు అదిమి ఉంచలేకపోతున్న, చూపరులను చిత్తు చేస్తున్న ఎత్తులు ఎద పొంగులు, గమ్మత్తుగా ఊగుతున్న పిరుదులు, తీగలా సన్నని ఒంపుల ఆకృతి, పోలికలు తెలియటం లేదే, పరిచయం ఉన్నట్లు లేదే! ఎవరీమె? ఎందుకొచ్చింది? ఎవరైనా చూస్తే...? అమ్మో! అప్పుడు తననే అల్లరి చేస్తుందా?

ఆ సమయంలో దగ్గర్లో ఉన్న చర్చిలో పన్నెండు గంటలు గణ గణా మోగి ప్రకాశం గుండెల్లో ప్రతిధ్వనించాయి. అంతలో తలుపుతట్టిన చప్పుడు, తర్వాత చిన్నగా తోయగా గడియ లేని తలుపు ఓ వైపు చిన్నగా శబ్దం చేస్తూ తెరుచుకొన్నది. ఆ చిన్న చప్పుడుకి కళ్లు తెరిచి చూసిన ప్రకాశానికి, ఓ చిన్నది మెరపులా కనిపించింది! ఉలికిపడి మంచం మీద, లేచి కూర్చున్నాడు. కళ్లు నులుముకొన్నాడు. మెల్లగా తలుపు మూసేసి, తన వైపు నడిచి వస్తున్న పడుచు ఈ సారి మరి కొంత స్పష్టంగా గోచరమైంది! నివ్వెరపోయాడు. ఆశ్చర్యచకితుడైపోయేడు. ఆ పైన మసక వెల్తురులోనే ఆమె పెదవుల పైన నవ్వు కన్పించింది. అంతే డంగైపోయేడు.!

ఎవరీ అమ్మాయి? అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఎందుకొచ్చింది? ఎవరో తరుముతుంటే తలదాచుకోవడానికి వచ్చినట్లుగా, కంగారుగాలేదు. చంద్రబింబం లాంటి గుండ్రని ముఖం. నవ్వుతున్నట్లున్న కాంతిగోళాల్లాంటి పెద్ద పెద్ద కళ్లు. బిగుతు జాకెట్టు అదిమి ఉంచలేకపోతున్న, చూపరులను చిత్తు చేస్తున్న ఎత్తులు ఎద పొంగులు, గమ్మత్తుగా ఊగుతున్న పిరుదులు, తీగలా సన్నని ఒంపుల ఆకృతి, పోలికలు తెలియటం లేదే, పరిచయం ఉన్నట్లు లేదే! ఎవరీమె? ఎందుకొచ్చింది? ఎవరైనా చూస్తే...? అమ్మో! అప్పుడు తననే అల్లరి చేస్తుందా? రూపారావన్నట్లు తన ప్రయత్నం లేకుండానే, వలచి వొళ్లో వాలిపోవడానికి సాహసించి వచ్చిన వనితా? ఎవరీమె? ఇప్పుడు తనేం చేయాలి. సాహసిస్తే సాచి లెంపకాయ కొడ్తుందేమో? మరెందుకొచ్చింది? అరే ...ఇంకా దగ్గరకొచ్చేస్తోంది!

ఇలా పరస్పర విరుద్ధాలోచనలతో కొట్టుమిట్టాడిపోతున్న ప్రకాశం పక్కకి వచ్చి కూర్చుంది, ఆ అపరిచిత వనిత.

అంతలోనే, ఏం మాట్లాడకుండానే, ప్రకాశాన్ని గట్టిగా కౌగిలించుకొని, ఆ పైన ముద్దు మీద ముద్దుపెట్టి ఉక్కిరి బిక్కిరి చేసేసింది! ఏం మాట్లాడలేదు గాని గమ్మత్తయిన శబ్దం ''ఊ... ఊ...'' అంటూ తమకంగా చేసింది. మళ్లీ గట్టిగా, మెత్తగా హత్తుకొంది. చిత్తయిపోయేడు. ప్రకాశం 'ఎవరు, ఏమిటి, ఎందుకు, ఎలా' అన్న మదిలోని ప్రశ్నలు ఎక్కడికో పారిపోయాయి! విచక్షణ కూడా పలాయనం చిత్తగించింది. ఈ సారి తనూ ఆమెను హత్తుకొన్నాడు. గాఢంగా ఊరువుల బరువులు ఎత్తుకొన్నాడు ఇంతకు ముందెన్నడూ తెలియని శృంగార మృదంగం దరువులు వేశాడు. కామంలో మునిగిపోయేడు. ఆనందమేఘాల్లో తేలిపోయేడు. శృంగారశిఖరాగ్రానికి చేరుకొన్నాడు. తడి మేఘాల్లో ఆడుకొన్నాడు. కాలం స్తంభించిపోయింది. ఘనీభవించిపోయింది. అంతలోనే ద్రవించిపోయింది.

ఏవో లోకాల్లో విహరిస్తున్న ప్రకాశం అదిరిపోయేడు. ''ఇక చాలెహె! నీ జిమ్మడ! ఒళ్లు కుదేలయిపోయిందెహె!'' అని కర్ణకఠోరమైన గొంతు మొదటిసారిగా పలికి, చేతుల్లో కర్కశంగా తోసేసరికి బెదిరిపోయేడు.

ఏం చేయాలో, ఏమనాలో తెలియని అయోమయం అతన్ని సంపూర్ణంగా కమ్ముకొంది. నోట మాట రాలేదు. కాని మనసు ''మూలుగుడు'' మళ్లీ మొదలెట్టింది!

ఇంతకీ ఎవరీమె? ఏమిటీ కర్ణకఠోరకర్కశస్వరం? పలుకులు? తనతో తప్పు చేయించి, మళ్లీ ఏమిటి వాగుడు? అన్న ప్రశ్నలు మనసులో ముళ్లల్లా కదిలి బాధించాయి!

ఆమైతే, అదేమీ లెక్క చేయకుండా, వస్త్రధారణ పూర్తి చేసుకొని, తన వైపు మళ్లీ తిరిగిచూసింది. బెడ్ లైటు మసక కాంతిలో ఈసారి కొంచెం స్పష్టంగా కనపడింది. అదిరిపోయేడు. గుండ్రని ముఖమేగాని, నిండా స్ఫోటకం మచ్చలు. కళ్లు పెద్దవే గాని, నిత్యం నిద్రలేనట్లు లోతుకుపోయి ఉన్నాయి. సన్నగా, నీరసంగా, బక్కపల్చగా వంపులు లేని వడిలిపోయినట్లున్న ఒళ్లు. దాన్ని అస్తవ్యస్తంగా కప్పిన చౌక రకం సిల్కు చీర, ములక్కాడల్లాంటి చేతులకున్న నాసిరకం రబ్బరు గాజులు, లివరు జబ్బున్న కుర్రదానికున్నట్లు కొంచెం ముందుకు వచ్చిన పొట్ట.

అంతకు ముందు చీకట్లో అపురూపసుందరిలా కనపడిన ఆ

పిల్ల ఇప్పుడంత అనాకారిలా మసక వెల్తురులోనే కనపడింది. ఇక పగలు చూస్తే అమ్మో? అనుకొన్నాడు. ఇదేం ప్రారబ్ధంరా బాబూ, అనుకొని వాపోయాడు. ఇలా పరిపరివిధాల ప్రకాశం ఆలోచనల్లో ఉండగానే, ఆ పిల్ల కొంచెం వంగి, టేబిల్ మీదున్న పర్సు లోంచి నోట్లు గబ గబా తీసుకొని జాకెట్టులో దోపుకొని, వడివడిగా గుమ్మం వైపు నడుస్తూంటే, కొయ్యబారి, ఉన్న చోటనే నిశ్చలంగా, మౌనంగా ఉండిపోయేడు ప్రకాశం ఆమెనే మాత్రం వారించలేక పోయేడు ఈ నెల వచ్చిన స్కాలర్‌షిప్ డబ్బంతా దోపిడి అయిందని అర్థమైనా!

గుమ్మం వైపు వెళ్లబోయి, ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆగి, అంతలోనే, వెనక్కి వచ్చి, ప్రకాశం బుగ్గ మీద మోటుగా గిల్లి, అదే సుబ్బిశెట్టి గొంతుకతో, "ఓయ్! బెంగపడ మాక, మళ్లీ కలుద్దాంలే నేనసలు ఇలా స్టూడెంటు కుర్రాళ్ల గదుల్లోకి ఎప్పుడూ రాలేదు. ఏదో ఇయ్యాళ ఏమీ బేరాలు లేక, మా ముసల్ది, ఒంటరిగా ఉన్నోడి రూమని చెప్తే ఇలా ఒచ్చేను ఎవ్వరూ చూడలేదులే. ఒస్తా మరి, అన్నట్లు నా పేరు సాయిత్రి, పక్క ఈధే మెరక ఈధంటే ఎవరైనా చెప్తారు. చింత చెట్టుంటాదే, మూడో నెంబరింట్లో కుడేపు వాటా.ఎడం వైపు అనసూయుంటాది అది మంచిది కాదు సుమా. ఓ నూర్రూపాయలు నీయి కాదనుకొంటే నా దగ్గరికి ఎప్పుడైనా రావొచ్చు. ఒస్తా చాలా..?" గలగలా చెప్పేసి, చెయ్యూపుతూ బయటికి వెళ్లిపోయింది సావిత్రి తలుపేసేసి!



ప్రకాశానికి చాలా సేపు దిమ్మతిరిగిపోయింది. తెల్లవారేదాకా, అలాగే నిశ్చలంగా, నిస్తేజంగా ఉండిపోయాడు. సూర్యోదయమైనాక వెలుగు రేఖలు కిటికీ లోంచి లోపలికి వచ్చి తాకేదాకా జరిగిందేమిటో అర్థం కాలేదు.

జరిగినదంతా మననం చేసుకోగా చేసుకోగా, కొంచెం కొంచెంగా అర్థమవసాగింది.

భగవంతుడా! ఎంత పని జరిగిపోయింది! ఎవరో వలపు దేవత దివి నుంచి దిగి వచ్చి నన్ననలరిస్తోందని మోసపోయానే! మెరక వీధిలో బేరాలు దొరకక వచ్చిన పడుపుగత్తె అని గ్రహించలేకపోయానే! బురదలోకి దిగిపోయేనే... ఇప్పుడెలా? స్కాలర్‌షిప్ డబ్బు పోయిందే! పట్టుకొనిపోతూంటే చూస్తూ ఉండిపోయానే. మెస్ చార్జీలు ఎలా కట్టాలి? అదలా ఉండి కర్మ గాలి ఏవైనా వెధవ జబ్బులంటుకొంటే ఏమిటి నా గతి? ఎవరికైనా ఎలా చెప్పుకోవాలి?

ఇలా లోపల్లోపలే వాపోతూ, ఎవరికీ మొఖం చూపించలేని దౌర్బల్యంతో, ఆ రోజంతా బయటికి రాలేక, రూములోనే ఉండిపోయాడు, కుమిలిపోతూ కుమిలిపోతూ. మెస్‌కి భోజనానికి కూడా పోలేదు.

ఆ రోజు రాత్రి పది దాటిన తర్వాత, చెల్లెలికి గౌను కొని పట్టుకొని వెళ్దామని ఎప్పుడో పుస్తకంలో దాచి ఉంచిన వంద రూపాయల నోటు జేబులో పెట్టుకొని, అటూ ఇటూ చూస్తూ వణుకుతున్న కాళ్లతో మనసుతో బయటికి నడిచేడు.

ముందు జాగ్రత్తగా డాక్టరు దగ్గరికి సలహా, వైద్యం కోసం కాదు.

మెరకవీధిలో మూడో నంబరు ఇంట్లో కుడి వైపు వాటాలో ఉండే సావిత్రి దగ్గరికి!

దీపం దగ్గరికి, మొదటిసారి అమాయకంగా వెళ్లి ఒళ్లు కాల్చుకొన్న పురుగు, అదే ప్రమాదకరమైన ఆకర్షణకు మళ్లీ మళ్లీ లోనై, దాని దగ్గరకు వెళ్లి ముద్దాడి, మాడి మసైపోతుంది, ఆఖరికి. ఆ దీపం పురుగు లాంటివాడే ప్రకాశం!

ప్రకాశం చదువు పాడుజేసుకొని, అప్పులు చేసి మళ్లీ మళ్లీ మెరకవీధికి వెళ్లి, ఒళ్లు గుల్ల చేసుకొని మరణం అంచుకి చేరుకొన్నాడు కొన్ని నెలలలోనే! కారణం తెలుసుకుని తల్లడిల్లిపోయేడు, అతని రూమ్మేటు రూపారావు.

ఏదో వెధవ సెక్సు పుస్తకాలు రహస్యంగా చదవటం తప్ప, వాస్తవంగా ఎటువంటి శృంగారానుభవమూ లేని, చదువు పూర్తయ్యాక మరదలితో జరగబోయే పెళ్లి కోసం పవిత్రంగా ఎదురుచూస్తున్న రూపారావు, ప్రకాశం దగ్గర అన్ని కోతలు కోసి, అతని పతనానికి కారణమయ్యానని గ్రహించేసరికి, గుండెలు బాదుకొనే లోగానే, ప్రకాశం ఆరిపోయేడు. దీపం పురుగులా మాడి మసైపోయేడు!



